# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ధాన్యం కొనుగోలుతో పాటు సకాలంలో చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ప్రజల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించనుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాపై సిబిసిఐడి విచారణకు ఆదేశించామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- సాగునీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీ నుండి ఎన్నికలు నిర్వహించనున్నట్టు మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.
- మార్గశిరమాస తొలి గురువారం కావడంతో ఈరోజు విశాఖపట్నం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

==================

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, కొనుగోలుకు సంబంధించి సకాలంలో చెల్లింపులు జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆయన దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటి వరకూ 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుకు ఎప్పుడు అండగా ఉంటుందని, రైతుకు అన్యాయం జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినా, రైస్ మిల్లర్లు, దళారుల ప్రమేయం ఉన్నాదని తెలిసినా ఉపేక్షించేది లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

===================

ప్రజాపంపిణీ వ్యవస్థలో లబ్దిదారులకు అందవలసిన బియ్యం అక్రమ రవాణాపై సిబిసిఐడి విచారణకు ఆదేశించామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రభుత్వంతో కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పండిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందని, రైతులు ఆందోళన చెందవచ్చని భరోసా ఇచ్చారు. పది రోజుల్లో 10.59 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఒక్క ఉత్తరాంధ్ర లోనే 1.69లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుఖాతాలో 24 గంటల్లో 229 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు.

(వాయిస్ 20 సెకన్లు)

===================

సాగునీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీ నుండి ఎన్నికలు నిర్వహించనున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... చివరి ఎకరం వరకూ సాగు నీరు అందజేయాలనే లక్ష్యంతో సాగునీటి సంఘాలను పునరుద్ధరించాలని నిర్ణయించామని తెలిపారు. సాగునీటి సంఘాలకు మూడు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయని, తొలి రోజు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ కమిటీ, మూడో రోజు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజక్టుల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని మంత్రి వెల్లడిస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

===================

ప్రజల భూ సమస్యలకు పరిష్కారాన్ని చూపేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల్ని రూపొందించిందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రెవెన్యూ సదస్సులపై జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన ఈరోజు దృశ్యామధ్యమం ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగే ఈ సదస్సుల్లో అధికార బృందాలే ప్రజల వద్దకు వెళ్లి రెవెన్యూ, భూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకూ, కోర్టు కేసులకు పరిష్కారం చూపేలా సదస్సుల్ని నిర్వహించనున్నామని మంత్రి వివరించారు.

విరామం

===================

రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు బాపట్ల జిల్లా జంపని గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలసి ఆయన సందర్శించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ... జిల్లాలో 2 లక్షల 15 వేల ఎకరాలకు 9 వేల ఎకరాలలో వరికోతలు పూర్తయ్యాయని తెలిపారు. వరి పండించిన రైతులందరూ రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యాన్ని అమ్మకాలు చేసుకోవాలని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

===================

భవిష్యత్ అవసరాలను అధిగమించేందుకు రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి, ఆధునీకరణ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని రూపొందించిందని విజయవాడ రైల్వే డివిజన్ అదనపు డివిజన్ మేనేజర్ ఎడ్విన్ తెలిపారు.

విజయవాడలో 35 కోట్ల రూపాయలతో అధునీకరిస్తున్న గుణదల రైల్వే స్టేషన్ లో జరుగుతున్న పనులపై పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నామని తెలియజేశారు.

===================

విశాఖ కేంద్రంగా 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని రేపటి నుంచి గీతం విశ్వవిద్యాయంలో నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు జరిగే యువ సమ్మేళనంలో గిరిజనుల సంస్కృతి, అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలపై ఉపన్యాసాలు ఉంటాయని ఆయన వివరించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, కన్కర్, మోహల్లా జిల్లాలు, ఒడిశాలోని కందమల్, కలహండి జిల్లాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమ్మేళనంలో భాగంగా రెండు రోజులు పాటు నగరంలోని సందర్శనీయ స్థలాలు, పరిశ్రమలు, ఆధ్యాత్మిక కేంద్రాలను గిరిజన యువతకు చూపిస్తామని తెలియజేశారు.

===================

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈరోజు మార్గశిరమాస తొలి గురువారం కావడంతో వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని మంచి నీటివసతి, అన్నప్రసాదం, దూరప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం బస్సులు ఏర్పాట్లు చేశామని దేవస్థానం కార్యనిర్వహణ అధికారిణి శోభారాణి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

===================

గిరిజన ప్రాంతంలో పోస్టల్ సేవలను మరింత విస్తరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. ఈరోజు కాలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కిసాన్ సమ్మాన్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, పాస్ సేవా కేంద్రాలు, ఆధార్ కార్డు నమోదు వంటి అనేక సేవలను అందిస్తున్నామని పోస్టల్ అధికారులు తెలియజేశారు.

===================

వసతి గృహాలలో మెరుగైన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో మరింత రాణించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అత్యవసర మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటాలని సూచించారు. వసతి గృహం స్లాబ్ మరమ్మత్తులు, నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి 14.40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

===================
===================